వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 01 జనవరి 2024


## నూతన సంవత్సరాన్ని విజయవంతంగా జరుపుకోవాలి

### ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



**రైల్వేకోడూరు, డిసెంబరు 31 ప్రభాతవార్త**

రానున్న కొత్త సంవత్సరాన్ని రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొ న్నారు. ఆదివారం వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సరానికి గాను ప్రతి ఒక్క కుటుంబంలో మంచి జరగాలని, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఏర్పాటు చేసిన నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయితో పాటు సుధాకర్‌రాజు, సర్పంచ్‌లు హరిక్రిష్ణారెడ్డి, ఆనాల కవితాచెంగల్‌రెడ్డి, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, గోపి, క్రిష్ణారెడ్డి, రమణారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి కష్టపడి చదివినపుడే ఉజ్వల భవిష్యత్తు

**బద్వేలు రూరల్ , డిసెంబర్ 31(ప్రభాతవార్త)**



ప్రతి విద్యార్థి చిన్న వయసు నుంచే కష్టపడి చదివినపుడు అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకో గలరని బద్వేలు పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ దివ్యలు అన్నారు. ఆగస్టులో జరిగిన ఇంగ్లీ షు ఒలంపియాడ్ పరీక్షలో 24 మంది విద్యార్థులు బంగారు పథకాలు సాధించడం పట్ల పలువురు విద్యార్థులకు వారి చేతుల మీదుగా పథకాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ దివ్యతేజలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివినపుడే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలుగుతారన్నారు. విద్యార్థులు కష్టించి చదివినపుడే భవిష్యత్తులో రాణించగలరన్నారు. తమ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను అందజేయడం జరుగుతుందని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలన్నారు. అపుడే పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తేగలరన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కార్మికుల సమ్మెలోకి...చెత్త వీధుల్లోకి...

### మురికి కూపాలతో దర్శనమిస్తున్న మున్సిపాలిటీ పట్టణం...





**రాజంపేట డిసెంబర్ 31,ప్రభాతవార్త:**

రాజంపేట మున్సిపాలిటీ పట్టణం మురుగునీటితో,చెత్తకుప్పలతో,దుర్వాసన వెదజల్లుతూ దర్శనమిస్తున్నాయి. మున్సిపాలిటీ కార్మికులు గత కొద్ది రోజులుగా సమ్మెలోకి వెళ్లడంతో పట్టణంలో ఇళ్లలో ఉన్న చెత్త మురుగునీరు రోడ్లపై చేరింది. చెత్తకుప్పల్లో పాడి పశువులు మునుగుతుంటే మురుగునీటి కాలువలపై మూతలు లేక దుర్వాసన వెదగలుగుతుంది. ఈ మురుగు నీటిలో క్రిమికీటకాలు తిరుగుతూ ప్రజలకు దుర్వాసనతో పాటు పలు వ్యాధులకు కూడా గురి చేస్తున్నట్టు పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యంత సుందరంగా ఉండాల్సిన మున్సిపాలిటీ పట్టణం మురికి,చెత్తకుప్పలకు నిదర్శనంగా అదంపడుతుంది గత కొద్దిరోజుల నుంచి మున్సిపాలిటీ కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కోసం సమ్మెలోకి దిగారు. దీంతో సంబంధిత మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టడంలో రోజురోజుకు విఫలంగానే కనపడుతున్నట్లు తెలుస్తుంది. కార్మికుల సమ్మెలో ఉన్నారని కమిషనర్‌కు తెలిసినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి బయట కూలీలతో పారిశుధ్యం పనులు చేప్పట్టడం పట్ల తీవ్ర జాప్యం చేస్తునట్లు పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు రోడ్డు వెంబడి చెత్త కోసం ఏర్పాటుచేసిన చెత్త తొట్టెలు కూడా కనపడటం లేదు. ముందే రాజంపేట పట్టణం మెయిన్ రోడ్డు ప్రాంతం ఇరుకుగా ఉంటుంది. దీనికి తోడు అధికంగా జనాలు ప్రతి క్షణంఎడతెరిపి లేకుండా బస్సులు,ఆటోలు. ద్విచక్ర వాహనాల వంటి వాహనాలు ఎడతెరిపి లేకుండా తిరుగుతుంటాయి. వాహనాలు వెళ్లేటుప్పుడు ఆ రోడ్డుపై ప్రజలు పక్కన నడిచేందుకు కూడా వీలులేని ఇరుకైన రోడ్లు ముందే ఇలా ఉంటే దీనికి తోడు రోడ్డుపైనే ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు మురుగునీరు దర్శనమిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు కూడా పట్టణ ప్రజలు తెలియజేస్తున్నారు. రోడ్డుపై నడవాలంటే ముందుకు వస్తే వాహనాలు కింద పడతామని భయం అలాగని పక్కకు వైదొలగాలంటే మెయిన్ రోడ్డు వెంబడి చెత్త కుప్పలు,మురుగునీటి కాలువలు ఉండటంతో ప్రజలు నడవడానికి వీలు లేకుండా ఉంది. మరి ద్విచక్ర వాహనాలు వెళ్లాలంటే పరిస్థితి మరి దారుణంగా ఉన్నట్టు తెలుస్తుంది. మన్నూరు పి ఆర్ ఈ ఈ ఆఫీస్ మొదలుకొని రోడ్డు వెంబడి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ఇరువైపులా చెత్త కుప్పలు మురుగునీటి కాలువలే అధికంగా ఉన్నాయి. దీంతో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు మురుగునీరు తిష్ట వేసి ఉండడంతో వాటిలో పశువుల,పందులు,కుక్కలు వాటిని ఆవాసాలుగా మార్చుకొని చెత్తకుప్పల్లోనే నివసిస్తున్నాయి. మురుగునీరు చెత్తకుప్పలు,పందులు,జంతువులు కుక్కలు వాటిని చెల్లా చెదురు చేయడంతో రోడ్డంతా చెత్తపడి దుర్వాసన వెదజల్లుతూ ప్రజలకు,పట్టణంలో నివసించే వారికి ప్రయాణికులకు,తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తున్నట్టు కూడా ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు ఈ రోడ్డుపై తిరుగుతే చెత్తకుప్పలు రోడ్డుపై వేయకుండా చూడొచ్చనో కూడా పట్టణవాపులు అంటున్నారు. ప్రతి రోజు చెత్త రోడ్డుపై వేయకుండా కుండీలు ఏర్పాటు చేసి చెత్త వేయాలని మున్సిపల్ అధికారులు ప్రతిరోజు హెచ్చరికలు చేస్తూ వస్తే ఇలా రోడ్డుపైకి చెత్త వేసి ఇబ్బందులు లేకుండా చూడొచ్చని కూడా పట్టణ ప్రజలు అంటున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జనార్దన్ రెడ్డిని వివరణ కోరగా కార్మికుల సమ్మెలో ఉండడంతో చెత్తను తొలగించడం కొంచం కష్టంగా ఉందని బయట కూలీలు కూడా దొరకడం లేదని అయినప్పటికీ వీలైనంతవరకు చెత్త కుప్పలను తొలగించేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు కూడా ఆయన తెలిపారు.



# పరిహారానికి ఆధార్ మెలిక...?





**వందమందికి పైగా నిలిచిపోయిన ప్యాకేజీ పరిహారం**

**ఉసురు మంటున్న ఉన్న ఊరువారు**

**ఆనందంలో పొరుగూరు వారు...కోర్టుకు ఎక్కనున్న వ్యవహారం...?**

**అయోమయంలో నిరాశ్రయులు**

**రాజంపేట డిసెంబర్ 31,ప్రభాతవార్త:**

ఊరువారు కలిసి తోలు చెడగొట్టిన చందంగా మంగంపేట డేంజర్ జోన్ గ్రామంలో పోటా పోటీలుగా ఉన్న పెద్దల విభేదాలు వ్యవహారంతో పరిహారం ప్యాకేజీకి గండి పడినట్లు తెలుస్తోంది. దీనిని అందజేయాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు ఆధర్ మెలిక పెట్టి సుమారు వందమందికి పైగా డేంజర్ జోన్ బాధితులకు అందాల్సిన ప్యాకేజీ పరిహారాన్ని నిలిపివేసినట్టు తెలిసింది. దీంతో శతాబ్దాలుగా ఉన్న ఊరిలో ఉన్న అసలైన డేంజర్ జోన్ నిరాశ్రయాలకు ప్యాకేజీ పరిహారం అందజేయకుండా నిలిపివేసినట్టు తెలిసింది. పరిహారం కోసం పొరుగు ఊర్ల నుంచి వచ్చి ఇల్లు నిర్మించుకొని అడ్రస్‌లు మార్చి ఆధర్ కార్డు చేయించుకున్న వారికి రెవెన్యూ శాఖ అధికారులు పరిహారాన్ని పళ్లెంలో పెట్టి అందజేస్తున్నారు. ఎంతో కాలం నుంచి ఎన్నో స్థిర,చరాస్తులు కలిగిన ఉన్న ఊరిలో ఉన్న కన్నవారికే చివరకు పరిహారం విషయంలో కష్టాలు ఎదురవుతున్నాయంటే గత కొన్నేళ్లుగా రెవెన్యూ శాఖ,ఇతర శాఖల అధికారులు చేసిన సర్వేలు ఎంత తప్పుడు అన్నది ప్యాకేజీ పరిహారంతోనే బట్టబయలు అయినట్టు తెలుస్తుంది. మంగంపేట డేంజర్ జోన్ గ్రామాలైన కాపు పల్లె,రెండు దళితవాళ్ళను గత కొన్నేళ్ల క్రితమే డేంజర్ జోన్ గ్రామాలుగా ప్రకటించారు. అప్పటినుంచి ఒకటి కాదు,రెండు కాదు అనేక పర్యాయాలు రెవెన్యూ శాఖ అధికారులు ఏపీఎండిసి సంస్థ యాజమాన్యం ఇతర శాఖల అధికారులు సర్వేల నిర్విహించి ఇళ్లకు నెంబర్లు వేయడం వారి పేర్లతోనే పరిహారాన్ని పబ్లికేషన్ చేయడం జరిగింది. అయితే అప్పటినుంచి పరిహారం అందే వరకు ఆ గ్రామాలలో అనేకమంది అక్రమంగా విచ్చలవిడిగా తాత్కాలిక నివాసాలు పరిహారం కోసం ఏర్పరచుకున్నవి ఎన్నో ఉన్నాయి. ఇదంతా సర్వే చేసే సంబంధిత శాఖల అధికారులకు కళ్ళకు కట్టినట్లే కనబడుతున్నాయి. వీరు కల్లఎదుటే నిర్మించుకోవడం కూడా జరిగిందని చెప్పడంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు. అయితే దీనివలన ప్రభుత్వానికి ఆదాయం గండి భారీగానే పడినట్టు తెలుస్తుంది. పరిహారం అందే సమయంలో ఆధార్ లు సక్రమంగా లేవని అడ్రస్లు వేరుగా ఉన్నాయని మెలిక పెట్టి అసలైన గ్రామస్తులకు పరిహారం అందకుండా వందమందికి పైగా నిలబెట్టారంటే దీని అంతర్యం అంతు పట్టడం లేదు ఉన్న ఊరివారినే ఉన్న ఊరు కాదని పొరుగు ప్రాంతాల నుంచి వచ్చి అక్రమంగా నివాసాలు ఏర్పరచుకున్న వారికి తప్పుడు ఆధార్ కార్డులు చేయించుకున్న వారికి అసలైన బాధితులు మీరేనని పరిహారాన్ని పళ్లెంలో పెట్టి అందజేస్తున్నారంటే అధికారులకు అక్రమంగా నివాసాలు ఏర్పరచుకున్న వారికి ఉన్న చుట్టరికంఎంత పెద్దదోనన్నది ఈ ప్యాకేజీ పరిహారం తోనే తెలుస్తుంది. డేంజర్ జోన్ గ్రామస్తులైన కాపుపల్లి వాసులు గనుల్లో చేపట్టే బ్లాస్టింగ్ పనులకు తట్టుకోలేక పక్కనే ఉన్న కోడూరు,తిరుపతి ప్రాంతాల్లో అద్దె ఇల్లు తీసుకొని కాపురాలు ఉంటున్నారు. ప్రభుత్వం ఆధార్ కార్డులు ఎక్కడైనా చేయించుకోవచ్చని భారతీయుడికి భారతదేశంలో ఎక్కడైనా ఆధార్ కార్డు ఉండొచ్చు అన్నది తెలిసిందే అయితే మంగంపేట పరిహారం విషయంలో ఈ సొంత ఊరు వారు నియోజకవర్గ కేంద్రమైన ప్రాంతాల్లోనే చేయించుకున్న ఆధార్ కార్డులు పనికిరావడం పరిహారా నికి మీరు అనర్హుల అనడం ఆశ్చర్యకరంగా ఉంది. ఇలాగైతే డేంజర్ జోన్ గ్రామాలైన కాపుపల్లిలో నిజాయితీగా కాపురం ఉన్నవారు అసలైన రేషన్ కార్డులు ఉన్నవారు డేంజర్ ప్రకటించే నాటికి ఎంత మంది ఉన్నారు అన్నది ఎన్ని కుటుంబాలు ఉన్నాయన్నది అధికారులు చేసిన తొలి సర్వేలోనే ఉంది. అధికారుల పక్కాగా నిజాయితీగా పరిహారాన్ని అందించి ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చూడాలంటే డేంజర్ జోన్ గా ప్రకటించిన నాటికి ఎంతమందికి రేషన్ కార్డులు ఉన్నాయి గ్రామంలో ఎన్ని ఇల్లు ఉన్నవి అన్నది అప్పట్లో వేసిన నెంబర్లు ప్రకారమే పరిహారం అందజేస్తే మరీ బాగుంటుంది. అంటున్నారు అక్రమాలకు పరిహారాలు అందజేసే వారికి ప్యాకేజీలన్ని వర్తింపజేసి గ్రామంలో ఉన్న సొంత హక్కుదారులకు పరిహారం ఇవ్వకపోవడం అన్నది దారుణంగా ఉంది దీనికి తోడు గ్రామంలో ఉన్న అసలైన వారిని తుంగలో తొక్కి అక్రమ కట్టడాల యజమానులు చేరడంతో గ్రామంలో ఉన్న ఇళ్ల కంటే మూడు నాలుగు రెట్లు అదనంగా ఇల్లు పెరిగి పరిహారం అందుకోవడమే కాకుండా ప్లాట్లు కూడా అదనంగా అక్రమంగా పొందుతున్నట్లు వారు అవేదన చెందుతున్నారు. ఈ ప్లాట్లు విషయమై ఇప్పటికే రగడలు జరిగి చివరకు రెవెన్యూ జిల్లా స్థాయి అధికారులు వార్నింగ్ ఇవ్వడంతో సర్దుకున్నారు దీనికి తోడు గ్రామానికి సంబంధం లేకుండా ఊరికి దూరంగా పంట పొలాల్లోనూ తోటల్లో దొడ్లల్లో పరిహారం కోసం నిర్మించిన కట్టడాలకు కూడా కోట్లలోనే పరిహారం ఇస్తున్నారన్న ఆరోపణ లేకపోలేదు ఇంత తంతు జరుగుతున్న అధికారులు వీటి చర్యలు తీసుకోవాల్సింది పోయి అసలైన వారికి పరిహారం ఆపి అసలైన అవనీతి రంగు బయటపడేటట్లు జరిగింది. ఆ విషయమై అధికంగా ఇచ్చాన ప్లాట్లు పొరుగూరుకు చేందినవారు నార్మించిన అక్రమ కట్టడాలు ప్రభుత్వాన్ని మోసంచేసి అక్రమ ఇళ్లకు అధికంగా పొందుతున్న వారిపైన గ్రామంలోని ఒక వర్గం కోర్టును కూడా ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది.

# నూతన సంవత్సరానికి కట్టుదిట్ల ఏర్పాట్లు



**మదనపల్లె, డిసెంబర్ 31 ప్రభాతవార్త :**

నూతన సంవత్సర సందర్భంగా 31 రాత్రి, జనవరి 1న ఎలాంటి సంఘ టనలు జరగకుండా కట్టుదిట్ల ఏర్పాట్లు చేసినట్లు డిఎస్‌పి కేశప్ప తెలిపారు. ఆది వారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లె సబ్‌డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ముఖ్యంగా పర్యాటక కేంద్రమైన హార్సీలీహిల్స్‌లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగ కుండా కట్టుదిట్ల ఏర్పాట్లు చేశామన్నారు. హార్సిలీహిల్స్‌కు ఆటోలు, ద్విచక్ర వాహనాలను నిషేదించా మన్నారు. హార్సిలీహిల్స్ కింద పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. నూతన సంవత్స రం సంద ర్భంగా హార్సీలీహిల్స్‌కు ఎక్కువుగా పర్యాటకలు వస్తుంటారని పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రజలు, వాహన దారులు పోలీసుల నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.






## రహదారి వ్యాపారిపై దూసుకెళ్లిన బొలెరో వాహనం

- వ్యాపారికి గాయాలు
- లక్ష విలువ చేసే సామగ్రి ధ్వంసం

**సంబేపల్లె, డిసెంబరు 31, ప్రభాతవార్త**

కర్నూలు-చిత్తూరు జాతీయ రహ దారిలోని సంబేపల్లి విద్యుత్తు సబ్ స్టేషన్ ఎదురుగా చిరు వ్యాపారిపై ఆదివారం బొలెరో వాహనం దూసుకెళ్లడంతో ఎర్రయ్య అనే చిరు వ్యాపారికి గాయాలు కాగా లక్ష రూపాయలు విలువ చేసే సామగ్రి ధ్వంసం అయినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలానికి చెందిన ఎర్రయ్య రహదారి వ్యాపారి. బతుకు దెరువు కోసం ఆరు సంవత్సరాల క్రితం సంబేపల్లెకు వచ్చినట్లు తెలిపారు. ప్రతినిత్యం జాతీయ రహదారి పక్కన అద్దాలు, టోపీలు, మాస్కులు, ఒనీలు, మంకీ క్యాప్‌లు పెట్టుకొని చిరు వ్యాపారం చేసుకొని భార్య పిల్లలను పోషించుకుంటుండేవాడు. పీలేరు నుంచి రాయచోటి వైపు వెళ్తున్న బొలెరో పికప్ చిరువ్యాపరిపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో వ్యాపారికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎలక్షన్ ఇయర్ @ ఇయర్ 2024

**రాజంపేట అర్బన్, డిసెంబరు 31 ప్రభాతవార్త**

కోటి ఆశలతో నేడు కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాం. అది కూడా ఎన్నికల సంవత్సరం. రాష్ట్ర చరిత్రలో ఈ ఎన్నికలు ఉమ్మడి కడప జిల్లాలో కీలకం కానున్నాయి. ఎందుకంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తుండడమే. వరుసగా 2 దఫాలు కంటిన్యూగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కడప జిల్లా నుంచే చక్రం తిప్పి సిఎంగా సారథ్య బాధ్యతలు నిర్వహించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 151 సీట్లతో కొత్త చరిత్రను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లిఖించారు. తెలుగుదేశంపార్టీకి ఒక్క సీటు కూడా లభించలేదు. ఇది గతం. నేటినుంచి కొత్త సంవత్సరంలో ఎన్నికల శంఖారావం దాదాపు వైసిపి, తెలుగుదేశం, జనసేన ఇప్పటికే పూరించాయి. ఈ ఎన్నికలు సిఎంకు సవాల్‌గా మారనున్నాయి. గత ఎన్నికల్లో సునాయాసంగా జిల్లాలో అన్ని సీట్లు క్లీన్‌చీప్ చేశారు. పరిస్థితులు మారాయి. ఎన్నికల సర్వేలు అధికార పక్షానికి కొంతవరకు ప్రతి కూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే ఒంటిచేత్తో పార్టీని నడుపుతున్న జగన్‌కు మాత్రం ఈ దఫా నల్లేరుమీద నడక మాత్రం కాదు. జిల్లాలో జగన్ సిఎం అయితే వైఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి కంటే ఇంకా ఎక్కువ ఊహించుకున్న జనం ఐదేళ్లు సమీపిస్తున్నా ప్రగతి రథం ఆశించిన స్థాయిలో పరుగులు తీయలేదు. పులివెందుల, రాయచోటి, పుంగనూరు, ప్రొద్దుటూరు, బద్వేల్ నియోజకవర్గాల్లో కొంతరకు పర్వాలేదనిపించినా మిగతా నియోజకవర్గాల్లో అభివృద్ధి నామమాత్రమేనని చెప్పవచ్చు. అయితే నాణేనాకి ఇదొక వైపు మాత్రమే. కొత్త అభివృద్ధి పనులకు సిఎం ఇటీవలే శంకుస్థాపన చేశారు. కడప పారిశ్రామిక పార్కు వేల కోట్లతో అభివృద్ధికి అడుగు పడింది. జిల్లా కేంద్రమైన కడపతో పాటు రాయచోటి కూడా ఆ స్థాయిలోనే అభివృద్ధికి అడుగు పడింది. ఇక తెలుగుదేశం పార్టీ మొదటిసారి ఉమ్మడి కడపజిల్లాలో పట్టు సాధించేందుకు సర్వశక్తులు ఒడ్డి పోరాడుతోంది. ఎలాగైనా సిఎం కోటలో పాగా వేయాలని ఉవ్విల్లూరుతోంది. తద్వారా అధికార పక్షానికి సొంత జిల్లాలోనే దెబ్బ కొట్టాలనే వ్యూహ ప్రతివ్యూహాలతో కసరత్తు చేస్తోంది. ఏకంగా జగన్ కంచుకోట పులివెందుల పైనే తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. పులివెందులలో జరిగిన రోడ్‌షో అక్కడ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సక్సెస్ కావడం ఆ పార్టీకి ఎంతో మల్టీవిటమిన్‌లా పని చేసింది. ఎమ్మెల్సి రాంగోపాల్‌రెడ్డి కూడ పులివెందులలో వైఎస్ కుటుంబ ఆధిపత్యానికి తాము గండికొట్టాయని చెప్పుకునేందుకు కారణమైంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య తర్వాత జరిగిన రాజకీయ సమీకరణలు, కేసు రాష్ట్ర ప్రభుత్వానికి, తెలుగుదేశానికి సవాల్‌గా మారింది. వివేకా మరణం తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు వచ్చే ఎన్నికల్లో ఎటువైపు మరలతాయో అర్థం కావడంలేదు. ఒకదశలో వివేకానందరెడ్డి సతీమణి టిడిపి తరపున పోటీ చేస్తారనే ప్రచారం కూడా జరిగింది. తాజాగా వైఎస్ కుమార్తె షర్మిల ఏకంగా కాంగ్రెస్‌పార్టీ చీఫ్‌గానే వస్తారనే ప్రచారం జోరందుకొంది. ఇదే నిజమైతే కడప నుంచి ఆమె పోటీ చేయడం దాదాపు ఖాయమనే చెప్పవచ్చు. రాజకీయాల్లో శాశ్వత శుత్రుత్వం, మిత్రుత్వం ఉండదనేది అక్షర సత్యం. అదే జరిగితే షర్మిల ఎలాగైనా కడపజిల్లాలో పోటీ చేయడం దాదాపు ఖాయమే. ఇది కూడా రాష్ట్ర రాజకీయాల్లో కీలకపరిణామమనే చెప్పవచ్చు. ఇకపోతే అధికార వైసిపిలో పెద్దఎత్తున మార్పులు జరుగుతాయని భావిస్తున్నారు. ప్రధానంగా సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చడం దాదాపు ఖాయమని తెలుస్తోంది. కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, రాయచోటి మినహా మిగతా నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు స్థానచలనం తప్పదని ప్రచారం జరుగుతోంది. కడప ఎంపి అవినాష్‌రెడ్డికి కూడా అసెంబ్లికి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. మైదుకూరులో అభ్యర్థిని మార్చనున్నారు. బద్వేలులో కూడా మార్చడం దాదాపు ఖాయమైంది. జమ్మలమడుగులో కూడా అభ్యర్థిని మార్చుతారని కొత్త సమీకరణలు చోటు చేసుకుంటాయని భావిస్తున్నారు. మరోవైపు ప్రతిపక్ష తెలుగుదేశంపార్టీలో అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రాలేదు. ప్రొద్దుటూరు, మైదుకూరు, రాజంపేట, కమలాపురం, రాయచోటి, రైల్వేకోడూరు అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సాములాంటిదే. ఈ నియోజకవర్గాల్లో టిక్కెట్ ఎవరికి అని ప్రతిపక్ష పార్టీలో సస్పెన్స్‌గా మారింది. ఇక కడప, అన్నమయ్య జిల్లాలో ఒకటి లేదా రెండు స్థానాల్లో జనసేన అభ్యర్థులు బరిలోకి నిలుస్తారని పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా కొత్త ఎన్నికల సంవత్సరంలో కడప జిల్లా వైపు రాష్ట్రం చూస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

**బద్వేలు రూరల్, డిసెంబరు 31 ప్రభాతవార్త :**

బద్వేలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు, అధికారులకు, రైతులకు , వ్యాపారులకు, కార్మికులకు, మరియు ప్రజలందరికీ ఎమ్మెల్సీ డి.సి.గోవింద రెడ్డి, ఎమ్మెల్యే డా॥ సుధ, వైసీపీ యువనాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్ తోపాటు పలువురు నాయకులు నూతన సంవత్సర శుభకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన సంవత్సరం అనుభవాలు , జ్ఞాపకాలతో నూతన ఏడాదితో సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని 2024 నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉంటూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని కోరుతూ నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలియజేశారు.



## హైవే రోడ్డును ఆక్రమిస్తున్న దుకాణాలు

**– చోద్యం చూస్తున్న అధికారులు**

**– డీకేటి భూముల్లో వెలుస్తున్న షెడ్లు**



ఓబులవారిపల్లె, డిసెంబరు 31, ప్రభాతవార్త

కడప-చెన్నై ప్రధాన రహదారి మంగంపేట హైవే రోడ్డును దుకాణాలు ఆక్రమిస్తున్నాయి. కొందరు లీజుకు తీసుకున్న యజమానులు ఇష్టారాజ్యంగా డీకేటీ భూములను లీజుకు తీసుకొని దుకాణాలకు సంబంధించిన రేకుల షెడ్లు వేయించి హైవే రోడ్డు సైతం ఆక్రమిస్తున్నారని పలువురు వివరిస్తున్నారు. మరో పక్క డికేటీ కొంత భూమి మరియు రిజిస్ట్రేషన్ కొంత భూమి ఉండడంతో ముక్కావారిపల్లె సర్వే నంబరు 10.95లో ఉన్న భూమిని లీజుకు తీసుకొని ఏకంగా ఒక సిమెంటు ఇటుకల ఫ్యాక్టరీ నిర్మిస్తూ దుకాణాలు అధికంగా డీకేటీ భూముల్లో నిర్మిస్తూ వ్యాపారాలు సాగిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఏది ఏమైనా కొంత మంది రెవెన్యూ అధికారులు ఆర్ఎంపీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

## శిల్పారామంలో కనువిందు చేసిన అమ్మవారి నృత్య ప్రదర్శనలు




కడప కార్పొరేషన్, డిసెంబరు 31, ప్రభాతవార్త

కడప శిల్పారామంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో చిన్నారులు తమ డ్యాన్స్ ప్రతిభతో సందర్శకులను, వీక్షకులను అలరించారు. విస్సా మూవీ పద్మాకర్ ఆధ్వర్యంలో ఆదివారం కడప శిల్పారామంలోని శిల్పకళావేదికపై మనుస్ డ్యాన్స్ అకాడమీ మనోహర్ మాస్టర్ కదిరి బృందం కూచిపూడి, సినీ భక్తి, పల్లె, జానపద నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని శిల్పారామం పరిపాలనాధికారి పి. శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

## నూతన సంవత్సరంలో ప్రజలు సుఖశాంతులతో జీవించాలి

**బద్వేలు , డిసెంబర్ 31(ప్రభాతవార్త) :**



2023వ సంవత్సరానికి వీడ్కోలు పలికి 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఈ సంవత్సరం ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఆమె తనయుడు రితేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నూతన సంవత్సరం అందరికీ కలిసి రావాలని వారు ఆకాంక్షించారు.

## మంట కలిసిన మానవత్వం

**– అక్కున చేర్చుకున్న వివేకానంద ఆశ్రమం**

**పోరుమామిళ్ళ రూరల్, డిసెంబర్ 31ప్రభాతవార్త:**

చిన్న గాయమైతే విలవిలలాడుతాం. చిన్న పురుగు వంటిమీద తిరుగుతుంటే కంగారుపడి విదిలించుకుంటాం. ఓ అభాగ్యురాలు గాయాల మీద పదుల సంఖ్యలో పురుగులు స్వైర విహారం చేస్తున్నాయి. చలి బారిన పడకుండా ఉండడానికి, వెచ్చగా పడుకోవడానికి చిన్న సందు కూడా లేకుండా తలుపులు, కిటికీలు బిగించుకుంటాం. ఈ తల్లిని వెళ్లిన చోటు ఊరి బయట బోరున గాలి వీచే పాత బస్టాప్. ఈమె నిస్సహాయంగా పడిపోయింది. నిర్దాక్షిణ్యంగా రద్దు మీద పడేశారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని రంగసముద్రం సత్రం వద్ద గత వారం రోజుల క్రితం 76 ఏళ్ల ధనలక్ష్మీ అనే అవ్వను సొంత కొడుకే రోడ్డుమీద వదిలేశాడు. అవ్వ దీన స్థితిని గమనించిన స్థానికులు వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన తన సతీమణి రామతులసితో కలిసి అవ్వకు నూతన వస్త్రాలు తొడిగారు. ఆ అవ్వను అప్యాయతతో పలకరించగా తన సొంత ఊరు వేంపల్లి మండలమని, కొడుకు భాగస్థిరపడ్డాడని కానీ తనను పట్టించుకోకుండా వదిలేశాడని కన్నీటి పర్యంత అయింది. రామకృష్ణారెడ్డి, రామ తుసలి అవ్వకు ఓదార్పు ఇచ్చి తమ తమ వివేకానంద సేవాశ్రమానికి తీసుకెళ్లి ఆశ్రయం కల్పించారు. పురుగులు పట్టిన అవ్వను యువ దంపతులు ఆదుకోవడం మానవత్వానికి నిలువుట్టదంగా నిలిచారు.

## ఉరివేసుకుంటూ వినూత్న నిరసన చేపట్టిన అంగన్వాడీలు



**పోరుమామిళ్ల ,డిసెంబర్ 31 ప్రభాతవార్త :**

స్థానిక తహశీల్దారు కార్యాలయం ముందు అంగన్వాడీలు చేపట్టిన దీక్ష ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగ న్వాడీలు ఉరివేసుకుంటూ వినూత్న నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సీఐ టీయూ జిలా ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్ మాట్లాడుతూ జీతం కోసం 20 రోజులుగా సమ్మె చేస్తున్న ముఖ్యమంత్రి స్పందించక పోవడం బాధాకరమాన్నరు. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి జగన్ టూర్లకు, పర్యటనలకు వెళుతూ కార్మికుల వేతనాలు పెంచకపోవడం దుర్మార్గమన్నారు. రాబోయే రోజులలో ఈ ప్రభుత్వానికి కఠిన పరిస్థితులు తప్పవన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి స్పందిం చి కనీస వేతనం 26వేల పెంపు, రిటైర్డ్ బెనిఫిట్ 5లక్షలు, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించి తమ న్యాయమైసమస్యలను పర్షిరించాలని కోరారు. ఈ కార్య క్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి మేరి, జిల్లా కమిటి సభ్యులు ఓబుళాపురం విజయమ్మ, లక్ష్మిదేవి, స్వామి, ప్రభావతి, జమాలమ్మ, సుహాషిని, మండల అధ్యక్షులు బొజ్జ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు..

## అన్ని రంగాల్లో వైసీపీ ప్రభుత్వం విఫలం

**– అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి**



కడప వైద్యవిభాగం, డిసెంబరు 31, ప్రభాతవార్త

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని టీడీపీ కడపనియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వి.ఎస్.అమీర్‌బాబు, సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డిలు విమర్శించారు. శనివారం బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ప్రారంభించారు. అక్కడి నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారస్థులను పలకరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రకాల పన్నులు ప్రజల నెత్తిన వేసి భారం మోపుతున్నారని విమర్శించారు. 9 సార్లు విద్యుత్తు ఛార్జీలు పెంచడం, మూడు సార్లు ఆర్టీసీ బస్సులు ఛార్జీలు పెంచడంతో ప్రజలపై పెను భారాలు మోపారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పన్నులు భారీలు, అధిక ధరలు తగ్గించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, వాలంటీర్లు కూడా రోడ్లపైకి రానున్న పరిస్థితులు ఉన్నాయని అంగన్‌వాడీలనుద్దేశించి తెలిపారు. నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది లింగాల శివశంకర్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్ జయరామిరెడ్డి, పాల కొండ్రాయుడు, దేవస్థానం మాజీ చైర్మన్ ఓబుల్‌రెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి శ్రీనివాసులు, తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, నాయకులు ఇమ్రాన్, మురళీ యాదవ్, ఎల్లయ్య యాదవ్, శంకర్ యాదవ్, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ, మామిళ్ల శివ, నాగేంద్ర నాయుడు, శేషయ్య నాయుడు, మహిళా నాయకురాలు స్వర్ణలత, నిర్మల, అరుణ, మాధవి, అమరావతి, మల్లేశ్వరి, ఉమాదేవి, దేవి, కరీమున్నీసా, షేక్ బీబీ, నారాయణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం..

కడప వైద్యవిభాగం, డిసెంబరు 31, ప్రభాతవార్త



ఏపీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన నంది మండలం విజయ్ సుశీల్‌ను ఆదివారం కడప నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యా లయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్ ఘనంగా సన్మానించారు. గతంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సుశీల్ అనతికాలంలోనే మంచి ప్రతిభ కనబరిచి జాతీయ, రాష్ట్ర నాయకత్వం మన్ననలను పొంది రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కడప జిల్లా వాసి నియామకం కావడం శుభ పరిణామమన్నారు. కడప జిల్లా యూత్ కాంగ్రెస్ కమిటీ సంపూర్ణ మద్దతు ఉంటుందని భవిష్యత్తులో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువత నిరుద్యోగ సమస్యల పట్ల కలిసి కట్టుగా పోరాటాలకు శ్రీకారం చుడతామని బండి సుమంత్ కుమార్ తెలిపారు. అనంతరం సుశీల్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నన్ను నియమించిన రాష్ట్ర, జాతీయ, నాయకత్వానికి మరి నన్ను బలపరి చిన కడప జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలి పారు. కార్యక్రమంలో బద్వేలు అసెంబ్లీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, పులి వెందుల అసెంబ్లీ అధ్యక్షుడు కొమ్మది శ్రీసాయి, ప్రొద్దుటూరు అసెంబ్లీ అధ్యక్షుడు వంశీ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు చక్రి, ప్రభుకుమార్, చిన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

## ఘనంగా అన్నదాన కార్యక్రమం



కడప వైద్యవిభాగం, డిసెంబరు 31, ప్రభాతవార్త

కడప నగరంలోని రాజారెడ్డివీధిలో అన్నదాన కార్యక్రమాన్ని సీఆర్ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సీఆర్ఐ సునీల్ జయంత్ ఆధ్వర్యంలో ఫ్రాంక్లిన్ సహకారంతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు చేతుల మీదుగా అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రారంభమవుతున్న శుభ సందర్భంగా అన్నదానం చేయడం ఎంతో పుణ్య కార్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఐ దినేష్‌కుమార్, పలువురు ప్రముఖులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలి

**– మౌలానా సొసైటీ ప్రెసిడెంట్ షబ్బీర్**



కడప వైద్యవిభాగం, డిసెంబరు 31, ప్రభాతవార్త

కడప నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం దగ్గర ఉన్న ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహంలో మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ దంత వైద్య నిపుణురాలు డా.పట్టెం ప్రత్యూష, సంఘ సేవకులు పట్టెం బాల గురువయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దంత సమస్యల గురించి పలు సూచనలు, సలహాలను డాక్టర్ పల్లెం ప్రత్యూష తెలిపారు. మౌలానా సొసైటీ ప్రెసిడెంట్ షబ్బీర్ మాట్లాడుతూ 2024వ నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని కోరుతూ ఉచిత దంత పరీక్షలు నిర్వహించి వారికి మందులు కూడా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రత్యూష సేవలు అభినందించారు. ఈ కార్యక్రమంలో నిరాశ్రయుల గృహ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, ఎస్ఎం రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## లారీ బ్యాటరీ దొంగ అరెస్టు

**పోరుమామిళ్ల , డిసెంబర్ 31(ప్రభాతవార్త)**



పోరుమామిళ్ల నందు రాత్రి సమయంలో ఆపి ఉన్న లారీల నుండి బ్యాటరీలను దొంగతనం చేస్తూ ఉన్న దొంగను ఆదివారం పోలీ సులు అరెస్టు చేశారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు షేక్ అల్తాఫ్ అనే వ్యక్తి లారీల నుంచి బ్యాటరీలు దొంగతనం చేసి వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తమకు రాబడిన సమాచారం మేరకు అతనిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి లక్ష రూపాయలు విలువ గల 15 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంజేఎస్ ఉమ్మడి కడప జిల్లా ఆత్మీయ సమావేశం

కడప వైద్యవిభాగం, డిసెంబరు 31, ప్రభాతవార్త



ముస్లిం జన సైనికుల ఇప్పటి వరకు పార్టీలో ఇది అంశాలలో వివిధ కార్యక్రమాలలో పాల్గొంటూ ఇదే విధంగా రానున్న రోజుల్లో ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థుల గెలుపునకు తమ వంతుగా కృషి చేస్తామని ఉమ్మడి కడప జిల్లా ముస్లిం జన సైన్యం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం కడప నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి కడప జిల్లా ముస్లిం జనసైనికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జన సైన్యం కమలా పురం ఐటీ కోఆర్డినేటర్ షరీఫ్ మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలోని అందరితో కలిసి ముస్లిం జన సైన్యం ఎంజేఎస్ అదే పేరుతో సంస్థను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ క్రమంలో తాము జనసేన పార్టీకి ఆర్థికంగా నైతికంగా, భౌతిక మద్దతు తెలియజేస్తూ జనసేన సిద్ధాంతాలను ప్రజలకు వివరించేలా ముందుకు సాగాలని నిర్ణయించామన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముస్లిం సామాజిక వర్గానికి తనవంతుగా అండగా నిలుస్తూ చేయూతనందించడాన్ని ఎంజేఎస్ వివరిస్తుందన్నారు. ఇటువంటి తరుణంలో తమ పార్టీ అధినేతకు మద్దతు లియజేయాల్సిన బాధ్యత తమందరిపై ఉందని గుర్తిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో షేక్ అలీ, గౌస్ అలీఖాన్, కరీముల్లా, బాబ్జీ, సలీం, అబ్దుల్ మాలిక్, 10 నియోజకవర్గాల ముస్లిం జన సైనికులు, ఎంజేఎస్ ప్రతినిధులు, ఆయా నియోజకవర్గాలకు చెందిన జనసేన అభిమానులు పాల్గొన్నారు.

## పెన్షనర్లకు 1వ తేదీన పెన్షన్ ఇవ్వాలి

**– పాత బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి**

కడప వైద్యవిభాగం, డిసెంబరు 31, ప్రభాతవార్త:



రాష్ట్రంలో ఉన్న పెన్షనర్లకు 1వ తేదీన వారి ఖాతాల్లో పెన్షన్ డబ్బులు జమ చేయాలని ఆంధ్రా పెన్షనర్ల పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునయ్య తెలిపారు. ఆయన ఆదివారం వారి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2018 నుంచి రావాల్సిన అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మెడికల్ రీఎంబర్స్‌మెంట్ మీద ప్రభుత్వం కంట్రోల్ పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ అయిన తరువాత పెన్షనర్లను చులకన భావనతో ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 4.50లక్షల మంది పెన్షనర్లున్నారని అందరినీ కలిపి ఒక రాజకీయ పార్టీగా ఆవిర్భవించిందని తెలిపారు. ప్రభుత్వంతో పోరాడే ప్రతి కార్మిక సంఘాలకు తాము మద్దతు ఇస్తామని పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్న ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులుగా నారాయణ, ట్రెజరర్‌గా శంకరయ్య, సెక్రటరీగా వెంకటేష్ ఎన్నుకున్నారు.

## క్రికెట్ కిట్ కోసం ధ్వజారెడ్డి నగదు వితరణ



రైల్వేకోడూరు రూరల్, డిసెంబరు 31 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట పంచాయతి యానాదిపల్లె అరుంధతి వాడ యూత్‌కు రైల్వేకోడూరు వైఎస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి 20 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో క్రీడా అభిమానులకు, వారి అవసరాలను బట్టి నగదును అందజేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రా అనే కార్య క్రమం ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించడానికి నగదును అందజేస్తున్నామని ఆయన అన్నారు. ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపికి చెందిన ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితునికి ముక్కా ఫౌండేషన్ రూ.50 వేల వితరణ

చిట్వేలి, డిసెంబరు 31 ప్రభాతవార్త

చిట్వేలి మండల పరిధిలోని రాజకుంట పంచాయతి అనుంపల్లి గ్రామానికి చెందిన మాదినేని చంద్రశేఖర్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం ఆదివారం ముక్కా ఫౌండేషన్ అధినేత రూపానందరెడ్డి కుమారుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి 50 వేల నగదును చెక్కు రూపంలో బాధితుని కుటుంబ సభ్యులకు అందించారు. కోడూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఆపదలో ఉన్న అభాగ్యులను గుర్తించి ఆపన్నహస్తం అందిస్తున్న ముక్కా ఫౌండేషన్ సేవలు ఎనలేని వని స్థానిక గ్రామ ప్రజలు కొనియాడారు. కార్యక్రమంలో రాజుకుంట సర్పంచ్ నరసింహా, నాగరాజు, నరసయ్య, బాబు, నాగేశ్వర, సుధాకర్, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, రమేష్, వేణుగోపాల్, వెంకటరమణ, కుమార్, శివయ్య, అనుంపల్లి గ్రామప్రజలు, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్, సాలవ రమణరాజు, గెద్ద పెంచలయ్య పాలసాని కిరణ్, పాలసాని సురేష్ పాల్గొన్నారు.

## అద్భుత ఆధ్యాత్మిక కట్టడం ఆయోధ్య రామ మందిరం..!

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు**

**(అన్నమయ్య ప్రతినిధి – ప్రభాతవార్త)**



500 ఏళ్ళ శ్రీరామ భక్తుల కల జనవరి 22వ తారీఖున నెరవేర బోతున్నదని, అద్భుత ఆధ్యాత్మిక కట్టడంగా చరిత్రలో ఆయోధ్య రామ మందిరం నిలిచిపోనున్నట్టు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష నాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక బిజెపి కార్యాలయంలో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న శ్రీరామభక్తులందరూ ఆ రోజున దీపావళి పండుగ చేసుకోబోతున్నారన్నారు. అందరికి ఆదర్శ పురుషుడు, మర్యాదా పురుషోత్తముడు అయిన శ్రీరామ చంద్రుడు ఆయోధ్యలో పుట్టడం మనందరికి తెలిసిన విషయమేనన్నారు. ష్టభుజి అలంకారంతో గర్భగుడి నిర్మాణం జరిగిందని, రిక్టర్ స్కేల్‌పై 10 తీవ్రతతో భూకంపాలు వచ్చినా మరే విధమైన విపత్తులు వచ్చినా కనీసం 2500 ఏళ్ల పాటు ఆలయం వాటిని తట్టుకునేలా డిజైన్ చేసినట్టు ఆరి ్కటెక్ట్ చెప్పుతున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 7 ఖండాల్లోని 115 దేశాల్లో నదులు, సముద్రాల నుండి తీసుకొచ్చిన నీటిని 2587 ప్రాంతాల నుండి తీసుకొచ్చిన మట్టిని రామాలయ నిర్మాణంలో వినియోగించినట్టు ఆయన వివరించారు. ప్రపంచంలో మూడో అతి పెద్ద హిందూ దేవాలయంగా రామమందిరం రూపు దిద్దుకొన్నదన్నారు. ఆలయ నిర్మాణంలో ఎక్కడా స్టీల్, సిమెంట్, కాంక్రీట్ వాడకుండా రాతిని ఉపయోగించారని, మొత్తం 110 ఎకరాల విస్తీర్ణంలో ఈ మందిర సముదాయం ఉంటుందన్నారు. ప్రధాన ఆలయమే 2.77 ఎకరాల విస్తీర్ణంలో 320 అడుగుల పొడవు, 235 ఆడుగుల వెడల్పు, 161 అడుగుల ఎతైన శిఖరంతో 12 ప్రవేశ ద్వారాలతో ఆలయ నిర్మాణం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి జికె నాగరాజు, కార్యదర్శి పి.రమణ, ఉపాధ్యక్షులు తోట నగేష్, బిజెపి నేతలు సూర్యచంద్ర, ప్రవీణ్‌కుమార , బొజ్జ అభిరామ్, మాకం రవి తదితరులు పాల్గొన్నారు.

## 250 మంది రోగులకు వైద్య పరీక్షలు



రామాపురం, డిసెంబరు 31, ప్రభాతవార్త

మారుమూల గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు చేసుకోవాలని డా.మోహన్ సిద్ధార్థ అన్నారు. మండలంలోని గువ్వల చెరువు శ్రీ బాలాజీ విద్యా నికేతన్ హైస్కూలు నీలకంఠారావుపేట ఎంపీపీ ఉర్దూ పాఠశాలలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మద్రాసు రాఘవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనువడు డా.మోహన్ సిద్ధార్థ, డాక్టర్ కావ్యలు కడప సిద్దార్థ న్యూరో కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వవైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన వారికి చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య పరీక్షల్లో మెదడు, వెన్నపూస, నరాల బలహీనత, పక్షవాతం, మూతివంకర పోవడం, మూర్ఛ, తలనొప్పి, నడుం నొప్పి, అరికాళ్ల మంటలు, తదితర సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలో పలు గ్రామాల్లో త్వరలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని గ్రామీణ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బండారు తిమ్మారెడ్డి, రేఖం రామ చంద్రయ్య, వెంకటేష్, ఆంజనేయులురెడ్డి, బాబు, ముబారక్, సుబ్బయ్య, శీను, పాఠశాల యాజమాన్యం రేహనుమా బేగం, దర్బార్ బాషా, కుమార్, శివయ్య, రఘురాం పాల్గొన్నారు.

## గాల్లగుండ్లపల్లి హరిజనవాడలో గజ్జల పూజ




రామాపురం, డిసెంబరు 31, ప్రభాతవార్త

మండలంలోని కల్పనాయుని చెరువు పంచాయతీ గాల్లంగుండ్లపల్లె హరిజన వాడలో గత 60 రోజులు పాటు కోలాటం నేర్పించి ఆదివారం రాత్రి గజ్జలపూజ నిర్వహించినట్లు భజన గురువు శివకాశి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మహిళలు బాలికలు ఎంతో ఉత్సాహంగా కోలాటాలు నేర్చుకోవాలని ఉద్దేశంతో 60రోజుల పాటు శిక్షణ ఇచ్చి 50 రోజుల తరువాత ఆదివారం రాత్రి గజ్జల పూజ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఆ గ్రామ నాయకులు వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ బాబు, నాగరాణి, హజరయ్య గురువుకు శాలువా కప్పి పూలమాల వేసి అభినందించారు. అనంతరం వచ్చిన గ్రామస్థులకు గురువుతో పాటు శిక్షణ పొందిన బాలికలు మహిళలు వారిని శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి గ్రామ మహిళలు, బాలికలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం

**రక్తదానం చేసిన సుధాకర్‌ను అభినందించిన డాక్టర్ సుమన్**

బద్వేలు రూరల్ డిసెంబర్ 31 ప్రభాతవార్త



ఆపదలో ఉన్నవారికి అవసరమని తెలసిన వెంటనే రక్తదానం చేయడం వలన మరొకరికి ప్రాణ దానం చేసిన వారవుతారని సంజీవని మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ కోట సుమన్, షుగర్‌వ్యాధి నిపుణురాలు డాక్టర్ వైవి. సరస్వతి, గైనకాలజిస్ట్ డాక్టర్ పవిత్ర అన్నారు. ఆదివారం అట్లూరు మండలం లింగాల కుంటకు చెందిన ఓ మహిళకు రక్తం అత్యవసరమని బ్లడ్ డోనర్స్ గ్రూప్‌లో వచ్చిన మెసేజ్‌ను గమనించిన పెద్ది మెన్స్‌వేర్ యజమాని పెద్ది సుధాకర్ తక్షణమే మహిళకు రక్తదానం చేసి తన మానవత్వాన్ని చాటుకున్న వారిని డాక్టర్ సుమన్ అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమన్ మాట్లాడుతూరోజూ అనుకోకుండా అనేక చోట్ల రోడ్ల ప్రమాదాల కారణంగా, మహిళలు కాన్పు సమయంలో రక్తం అత్యవసరమైన వెంటనే రక్త దాతలు స్పందించి రక్తదానం చేయడం వలన అనేక మంది ప్రాణాలు కాడిన వారవుతారన్నారు. ఆదివారం రక్తం అత్యవసరమని తెలిసిన వెంటనే బట్టల వ్యాపారి సుధాకర్ వ్యాపారం కూడా పక్కనపెట్టి తక్షణమే స్పందించి మహిళకు రక్తదానం చేయడం అభినంద దయనీయమన్నారు. వీరివెంట షేక్ దాదా పీర్ ఎన్ఆర్ఐ, ఆసుపత్రి సిబ్బంది సుబ్బ రాయుడు, మధుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## విగ్రహ ఆవిష్కరణకు పలువురిని కలిసి ఆహ్వానం

**జిల్లా అధ్యక్షులు నారుపల్లె జగన్మోహన్ రెడ్డి**



ఖాజీపేట డిసెంబర్ 31, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో జనవరి 7వ తేదీ న అనంతపురంలో స్వాతంత్ర్య సమర యోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంకు కడప నగరంలో పలువురిని కలిసి ఆహ్వాన పత్రాలను అందజేసినట్లు ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు నారుపల్లె జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలో ప్రెస్ క్లబ్ నందు అన్నదాన ప్రభువు దాన కర్ణుడు అయినటువంటి ఉయ్యాలవాడ బుడ్డా వెంగల్ రెడ్డి 123వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు నారుపల్లె జగన్మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శులు ఎల్.విజయభాస్కర్ రెడ్డి,ఎం.రామభూపాల్ రెడ్డి పలువురి రెడ్డి బంధువులను కలిసి ఈ నెల 7వ తేదిన అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ నందు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ప్రతిష్టకు హాజరుకావాలని ఆహ్వాన పత్రాలు అందజేసినట్లు జగన్మోహన్ రెడ్డి తెలిపారు. నంది పురస్కార గ్రహీత వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు యోగివేమన విశ్వ విద్యా లయ పాలక మండలి సభ్యులు అయిన మూల మల్లికార్జున రెడ్డి,నగర మున్సి పాలిటీ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మొరంరెడ్డి వేణుగోపాల్ రెడ్డి,వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డిను కలిసి విగ్రహ ఆవిష్కరణకు రావాలని ఆహ్వా నించారు. మల్లికార్జున్‌రెడ్డి సందర్భంగా మాట్లాడుతూ ఉయ్యాలవాడ నర సింహా రెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంకు హాజరువుతానని రెడ్డి సం ఘం ప్రతినిధులకు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## సమాజ సేవే ధ్యేయంగా అన్నదాన కార్యక్రమం

**– యువ నాయకుడు చందు రెడ్డి**



కలికిరి డిసెంబరు 31, ప్రభాతవార్త

సమాజంలో అన్నం లేకుండా ఆకలితో అలమటిస్తున్న అనాథలను తన వంతు ఆదుకునేందుకే ఆదివారం కలికిరి మండలంలో అన్నదాన కార్యక్రమం చేపట్టి పలువురి అనాథలకు అన్నదానం చేసినట్లు యువ నాయకుడు చందు రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని పలు ప్రాంతాల్లో అక్కడున్న అనాథలను గుర్తించి వారికి అన్నదానం చేశారు. ఈ విధంగా అధిక సంఖ్యలో వృద్ధులకు అన్నదానం చేయడంతో వృద్ధులు కడుపునిండా అన్నం తిని మంచి కార్యక్రమాలు చేస్తున్నారని వారిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రభాతవార్త చందురెడ్డిని పలకరించా ఇక నుంచి పలు సేవా కార్యక్రమాలు చేపడతామని సమాజంలో సేవ చేయడమే తమ వంతు ధ్యేయంగా పని చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు జబ్బీర్, గురు, షావల్లీ, సాయి ఈశ్వర్, శివమని, సునీల్, ఫయాజ్, వంశీ, బన్నీ చందు, సందీప్ పలువురు యువకులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**– 115 మందికి వైద్య సేవలు**



కలికిరి డిసెంబరు 31, ప్రభాతవార్త

మండలంలోని గుట్టపాలెం పంచాయతీలో ఆదివారం ఎస్‌పీఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరానికి పంచాయతీలోని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. వీరికి ఎస్‌పీఎస్ హాస్పిటల్ వైద్యులు మహ్మద్ నషిం, డా.సిమ్రాన్‌లు పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి బుధవారం తమ హాస్పిటల్‌లో ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ తెలిపారు.

## కార్మికుల సమ్మెను విజయవంతం చేయండి

**జిల్లా సెక్రటరీ సురేష్‌కుమార్**



మదనపల్లె, డిసెంబర్ 31 ప్రభాతవార్త :

మున్సిపల్ కార్మికులు జనవరి 3నుంచి చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సురేష్‌కుమార్, సెక్రటరీ మస్తాన్‌లు తెలిపారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం నుండి సిటిఎం రోడ్డు మీదుగా ఆర్టీసి బస్టాండు, అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసనలు తెలుపుతూ అబేద్కర్ విగ్రహానికి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల ప్రధాన సమస్యల పరిష్కారం నిమిత్తం చేపట్టే సమ్మెకు ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలిపాలన్నారు. ఎన్నో సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం భాదాకరన్నారు. సుమారు 17 ప్రధాన సమస్యలు కార్మికులు ఎదుర్కొంటున్నారన్నారు. సమ్మెతోనైనా ప్రభుత్వం దిగిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలప్ప, వరప్రసాద్, శ్రీనివాసులు, నాగరాజు, మధు, భాగ్యలక్ష్మి, నరసింహులు పాల్గొన్నారు.

## ఆదిత్య కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

మదనపల్లె, డిసెంబర్ 31 ప్రభాతవార్త :



మదనపల్లె సమీపంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన అధ్యాపకుడు కె.లక్ష్మయ్యకు డాక్టరేట్ అవార్డు వచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సతీష్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగానికి సంబంధించి పని చేస్తున్న ఈయన డెన్సిటి అండ్ డిస్టెన్స్ బేస్ట్ అప్టిమైజ్‌ఖ కె-మీన్స్ క్లస్టరింగ్ మెథడ్స్ ఫర్ అనాలసీస్ ఆఫ్ స్పేషియల్ డేటా మీద జేఎన్‌టియు హైదరాబాద్ వారు పిహెచ్‌డి డిగ్రీ, గౌరవ డాక్టరేట్ అవార్డు ప్రదానం చేశారన్నారు. డాక్టరేట్ పట్ల ఆయనను కళాశాల ఛైర్మెన్ ఆర్.రామ్మో హన్‌రెడ్డి, అధ్యక్షులు నాగమల్లారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

## 20 మద్యం బాటిళ్లు స్వాధీనం వ్యక్తి అరెస్టు

కలకడ, డిసెంబరు 31 ప్రభాతవార్త

స్థానిక పోలీసులకు అందిన రహస్య సమాచారం మేరకు మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లెకి చెందిన లేట్ బాసుసాహెబ్ కుమారుడు షేక్ నూర్‌బాసా గ్రామానికి సమీపంలో ఉత్తర దిక్కున ఉన్న చింతచెట్టు కింద 20 రాయల్ ప్యాలెస్ మందు సీసాలను కలిగి ఉన్నట్లు సమాచారం అందడంతో ఎస్సై తన సిబ్బందితో దాడులు నిర్వ హించారు. ఈదాడులలో 20 మందు బాటిళ్లు స్వాధీనం చేసుకుని షేక్ నూర్‌బాషా ను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈదాడులలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాసేవే తమ లక్ష్యం

నిమ్మనపల్లె, డిసెంబర్ 31 ప్రభాతవార్త :



మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షునిగా నూతనంగా ఎంపికైన సైదాపేటకు చెందిన ముబారక్ ఆదివారం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీకి మండలంలో సేవలు అందించాలని ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. తాను గతంలో మండల సేవాదల్ అధ్యక్షునిగా స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే ఆవులమోహన్‌రెడ్డి శిష్యునిగా మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ముజీ హుస్సేన్‌ల అనుచరునిగా పార్టీకి సేవలు అందించాలనన్నారు.

## నూతనోత్సహంతో 2024లోకి అడుగు పెట్టాలి

**మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి**

కురబలకోట, డిసెంబర్ 31 ప్రభాతవార్త :



కురబలకోట మండలంలోని ప్రతి ఒక్కరూ నూత నోత్సహంతో 2024లోకి అడుగులు వేయాలని మైకాపా నాయకులు, మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసా ని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన అంగళ్ళులో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నూతన సంవత్సరంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. మండల ప్రజలకు ఎల్లవేలలా అందుబాటులో ఉండి వారి సంక్షేమా భివృద్ధికి శక్తి వంచనకు కృషి చేస్తామన్నారు. మండల వాసులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు



రామసముద్రం, డిసెంబర్ 31 ప్రభాతవార్త

మండలంలోని పెద్దకురపల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శివారెడ్డి ఆనందమ్మ దంపతులు ఘనంగా పూజలు నిర్వహించడం జరిగింది. అర్చకులు, రాజాస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పలురకాల పుష్పాలతో అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు శివారెడ్డి, ఆనందమ్మ, గిరిజమ్మ, మోహన్‌రెడ్డి, స్వర్ణ, రాజాప్రతాప్‌రెడ్డి, అరుణచ అనసూయ, అదర్స్ రెడ్డి, తేజ, చైత్ర, దీక్ష తదితరులు పాల్గొన్నారు.

## అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు సత్యనారాయణరెడ్డి

పీలేరు, డిసెంబరు 31 ప్రభాతవార్త

కలికిరి గత జ్ఞాపకాను నెమరువేస్తూ కొత్త ఆశయాలకు ఊపిరి పోస్తూ అభ్యుదయం ఆకాంక్షిస్తూ మీ జీవితాల్లో వెలుగులు నింపాలని సరికొత్త విజయాలను అందించాలని ప్రతి ఒక్కరు సంతోషంగా గడపాలని ప్రతి ఒక్కరికి ఆనందాలను పంచాలని ఆకాంక్షిస్తూ కొత్త ఆశలు, ఆశయాలు అవకాశాలు ఆనందాలతో మీజీవితం నిండిపోవాలని కోరుకుంటూ...పాత సంవత్సరానికి వీడుకోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అందరికి నూతన సంవత్సరశుభాకాంక్షలతో రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు పులి సత్యనారాయణరెడ్డి కోరారు.

## జనసేన కండువా కప్పుకున్న ముస్లీం యువత



పీలేరు, డిసెంబరు 31 ప్రభాతవార్త

కలికిరి నియోజకవర్గ ఇన్‌చార్జి బెజవాడ దినేష్ ఆధ్వర్యంలో 40 మంది ముస్లీం యువత జనసేన పార్టీ కండువా కప్పుకున్నారు. కలికిరి పట్టణంలోని మండల ఉపాధ్యక్షులు అస్లాం ఇంటిలో ఓ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జనసేన పార్టీ ఇన్‌చార్జి దినేష్ పాల్గొ న్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా , జనసేన పార్టీల ఆదేశాల మేరకు పీలేరు నియోజకవర్గ పరిధిలో వచ్చే ఎన్నికల్లో 2024లో కిశోర్ కుమార్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రవి, షావలి, కళ్యాణ్, బాబయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన ఉత్సాహంతో 2024లోకి అడుగు పెట్టాలి : ఎస్ఐ రామక్రిష్ణ

నిమ్మనపల్లె, డిసెంబర్ 31 ప్రభాతవార్త :



నిమ్మనపల్లె మండలంలో 2024లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంతో నడవాలని పోలీసులు నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్ఐ రామక్రిష్ణ కోరారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జూదాలు, నేరాలు, దొంగ తనాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ నడవాలని ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా తమ దృష్టికి తేవాలని ఆయన తెలిపారు. మండల వాసులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పోరుమామిళ్ల ,డిసెంబర్ 31 ప్రభాతవార్త :

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోరుమామిళ్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆదివారం ఒక ప్రకనలో వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపు కోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని,మైనర్లు వాహనాలు నడ పడం చేయరాదని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాలలో ప్రజలకు ఇబ్బంది కలిగించే కేక్ కటింగ్ తదితర పనులు చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## మండల ట్రాన్స్‌కో ఏఈగా రామ్మూర్తినాయక్

కురబలకోట, డిసెంబర్ 31

ప్రభాతవార్త :



కురబలకోట మండల ట్రాన్స్‌కో ఏఈగా ఎం.రామ్మూర్తి నాయక్‌ను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ వెంకటరత్నం చిత్తూరుజిల్లా పుంగనూరుకు బదిలీపై వెళ్ళారు. పెద్దమండ్యంలో పనిచేస్తున్న ఈయనను ఇక్కడ ఇన్‌చార్జ్ ఏఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి జం తువుల నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు పంటల చుట్టూ విద్యుత్ కంచెలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలన్నారు. ఎల్ఈడి లైట్లను వినియోగిస్తే విద్యుత్ ఆదాతో పాటు బిల్లు లు కూడా తక్కువగా వస్తాయన్నారు. కరెంటు సమస్యలను తక్షణమే పరిష్క రించేందుకు చర్యలు చేపడుతామన్నారు.

## మర్రికుంటపల్లెలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం



కలికిరి డిసెంబరు 31, ప్రభాతవార్త

మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ పాత హరిజనవాడలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి తెదేపా మేనిఫెస్టోలోని వివరాలు ప్రజలకు వివరించి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ యాప్‌లో వారిని నమోదు చేయడం జరిగింది.కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు ఎం.ఆనంద్‌రెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధికారమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలి



నిమ్మనపల్లె, డిసెంబర్ 31 ప్రభాతవార్త :

దేశ స్వాతంత్ర్యం పోరాటంలో కాంగ్రెస్ పార్టీ అత్యంత క్రియాశీలక పాత్ర పోషించిందని మదనపల్లె పట్టణ కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాబ్ అన్నారు. ఆదివారం నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయితీలో పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటి ప్రధాన మంత్రి జవహార్‌లాల్‌నెహ్రూ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడం గర్వకారణం అన్నారు. అనంతరం స్వర్గీయ ఇందిరాగాంధీ, స్వర్గీయ రాజీవ్‌గాంధీ దేశసేవలో ప్రాణాలు వదిలా రన్నారు. స్వర్గీయ పివి నరసింహారావు, మన్‌మోహన్‌సింగ్ సంస్కరణల ఫలితం గా దేశం ఆర్ధిక పరిపుష్టిని సాధించిందన్నారు. కాంగ్రెస్ హాయంలో ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్‌పార్టీకి కృషి చేయాలన్నారు.

## కబడ్డీ,చైర్ ఆటలతో అంగన్వాడీల నిరసన



మైదుకూరు డిసెంబరు 31, ప్రభాత వార్త

అంగన్వాడీలు నిర్వహిస్తూన్న సమ్మె ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకున్నది.ఈ సందర్భంగా మైదుకూరు ఎంపిడివో కార్యలయం ఆవరణలో కబడ్డీ,చైర్ ఆటల రూపంలో నిరసన తెలియజేశారు,అంగన్వాడీ కార్యకర్తలు జగన్ మాస్కుదరించి జగన్మోహన్ రెడ్డి వేషదారుడి రూపంలో అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి, గ్రాడ్యుటి అమలు చెయాలి,మినీసెంటర్లను మెయిన్ సెంటర్లుగా ప్రమెట్ చెయాలి అంటు కూత రూపంలో తమ డిమాండ్లను తెలియ జేశారు.ఈ సంధర్భంగా సిఐటియు మాజీ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ 20 రోజులుగా సమ్మె నిర్వహిస్తూన్న రాష్ట్ర ప్రభుత్వానికి కనికరం లేదని పైపెచ్చు అంగన్వాడీలను భయపెట్టే ప్రయత్నం చేస్తూందని ఆరోపించారు. రాబోవు రోజులలో సమ్మెను మరింత తీవ్రతరం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉక్కిరి భిక్కిరి చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్ల ధనలక్ష్మీ,భారతి,చెన్నమ్మ,రిజ్వాన,లక్ష్మీదేవి,అనూరాధ,శ్యామల,రామతులసీ,అనూష,మహేశ్వరి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గోన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ...



పుల్లంపేట, డిసెంబరు 31 ప్రభాతవార్త

పుల్లంపేట మండలంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను గురించి ఆదివారం పివిజిపల్లె, దళవాయిపల్లె పంచాయితీల్లో అధికారులు బిజెపి నాయకులతో కలిసి ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న పలు పథకాలను గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా పంట పొలాలకు పురుగు మందులను చల్లేందుకు కాను డ్రోన్‌పై ఏవిధంగా ఉపయోగపడుతుందనే విషయాలను రైతులకు చెప్పారు. ఈ డ్రోన్ విలువ 10 లక్షలు కాగా అందులో 4 లక్షల రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చే విషయాన్ని, వంటగ్యాస్ పథకాల గురించి ఇంకా పలురకాల పథకాల గురించి ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులతో పాటు మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతి సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లు కల్వర్టుల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ



ప్రొద్దుటూరు డిసెంబర్ 31, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ పరిధిలోని హౌసింగ్ సొసైటీ బోర్డు కాలనీలో 25లక్షల అంచనా వ్యయంతో సీసీరోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు నియోజికవర్గంలో గ్రామీణ ప్రాంతాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. అందులో భాగంగా గోపవరం పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. నియోజికవర్గంలో ఒక పక్క సంక్షేమం, అభివృద్ధి చేస్తూ ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వాన్ని తిరిగి ఎన్నుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుల్‌రెడ్డి, గోపవరం సర్పంచ్ గద్దె మోష, ఉపసర్పంచ్ రమాదేవి, స్థానిక వైసిపి నాయకులు కొండయ్య, దేవిప్రసాద్‌రెడ్డి, గోకుల మేరి పాల్గొన్నారు.

## ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

**ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాధరెడ్డి**

వీరబల్లి,డిసెంబర్31, ప్రభాత వార్త

మండల ప్రజలందరూ కొత్త సంవత్సరంలో సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాధ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని తన నివాసంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ మండల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అందరూ సంతోషంగా ఉండాలన్నారు. జగనన్న ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుండి ఇప్పటి వరకు ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ముంగిటికే చేర్చా రన్నారు. ఈ రోజుతో జగనన్న ఇచ్చిన మాట ప్రకారం ప్రతి అవ్వ తాతకు రూ.3వేలు ఫించన్ ఇచ్చామని అన్నారు. చెప్పిన హామీలన్నీ కాకుండా చెప్పనివి కూడా చేశామన్నారు. వైసిపి పార్టీ తరపున మరోసారి మండల ప్రజలకే కాకుండా నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## చోరీ సొత్తు రికవరి, ఇరువురి అరెస్ట్

చాపాడు, డిసెంబర్ 31, ప్రభాతవార్త

మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి విశ్వనాథపురం గ్రామం వద్ద శ్రీఆంజనేయ స్వామి గుడిలో ఈనెల 12న గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి అందులో నగదు దోచుకువెల్లినట్లు పోలీసులు కేసు నమోదుచేశారు. శనివారం చాపాడు ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో పాటు, సెంట్రల్ క్రైమ్ పోలీసులు దొంగతనానికి పాల్పడిన ఇద్దరు బాల నేరస్థులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి దొంగతనాలకు ఉపయోగించిన పల్సర్ బైక్‌తో పాటు, లక్ష 20వేలు రికవరి చేసి బాల నేరస్థుల గృహంనకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## 20వ రోజుకు చేరుకున్న అంగన్వాడీల సమ్మె



ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 31

ప్రభాతవార్తం సమస్యల పరిష్కారం కొరకు గత కొన్ని రోజులుగా నిరసన చేస్తున్న అంగన్వాడీల సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. ఈ సమ్మెను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని, ఈ పరిస్థితి కొనసాగితే ప్రభుత్వానికి పుట్టగతులు ఉంటవన్నారు. జనవరి 3వ తేదిన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన కొనసాగుతుందన్నారు. దీనికి కడప జిల్లాలో అంగన్వాడీలు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటిసి రాష్ట్ర నాయకులు మంజుల, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్య నారాయణ, సీఐటీయూ కార్యదర్శి విజయ్‌కుమార్, అంగన్వాడి ఇండియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, విజయ అంగన్వాడీలు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు చేరుకున్న అయోధ్య అక్షింతలు



ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 31, ప్రభాతవార్త

ఎన్నో సంవత్సరాల నుంచి అయోధ్యలో రామ మందిరం నిర్మాణం కోసం హిందూ బంధువుల కళ అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తి అయి జనవరి 22వ తేది2024 విగ్రహ ప్రతిష్ట జరుగుతున్న శుభసందర్భంగా అయోధ్య రామతీర్థ ట్రస్ట్ వారు దేశమంతా అన్ని గ్రామాల్లో ప్రతి హిందు కుటుం బానికి అయోధ్యలో పూజించిన అక్షింతలు చేరుకున్నాయి. ఈ అక్షింతలను జన వరి 1వ తేదిన అనగ నేడు సోమవారం నుండి విశ్వహిందూ పరిషత్ మరియు ఆర్ఎస్ఎస్ కుల సంఘాలు, రామభక్తులు అందరూ వారి వారి ఏరియాల్లో ప్రతి హిందూ కుటుంబానికి అక్షింతలు రాముల వారి ఫోటో అందచేసి కార్యక్రమం జరుగు తున్న సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో రామేశ్వరం దేవాలయాల నుండి వసంతపేట, గాంధీరోడ్డు, టీబీరోడ్డు మీదుగా శివాలయం సర్కిల్ వరకు బైక్‌ర్యాలీ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

దువ్వూరు, డిసెంబరు 31, ప్రభాతవార్త



మండల పరిధిలోని 56 అంగన్‌వాడీల సమ్మె ఉదృతం చేశారు. సమ్మె మొదలై 20 రోజులైనా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపక పోవడంతో అంగన్‌వాడీ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలు పెంచాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని సమ్మె ఉదృతం చేస్తామన్నారు. అంగన్‌వాడీలు తెరిస్తే ధర్నాలు చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## రాష్ట్రంలో అప్పులు తప్ప అభివృద్ధి శూన్యం

**బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి**



**మదనపల్లె, డిసెంబర్ 31 ప్రభాతవార్త :**

రాష్ట్రంలో అప్పులు తప్ప అభివృద్ధి శూన్యమంటూ భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సొసైటికాలనీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగన్నరేళ్ళుగా రాష్ట్రం అప్పులు, అవినీతి, ఆరాచకాలతో కొట్టుమిట్టాడు తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రం రూ.11లక్షల కోట్లు అప్పుల్లో కూరుకు పోయిం దన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు 2019లో అధికారాన్ని అప్పగించేటప్పుడు రూ.3.50లక్షల కోట్లు అప్పులు ఉండగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈ అప్పును లక్షల కోట్లుకు పెంచారన్నారు. రావాలి జగన్, కావాలి జగన్ అన్న ప్రజలు వద్దు జగన్ అంటూ చెప్పడం జరుగుతుం దన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఒరిగిందేమిలేదన్నారు. ఉపాధి, పరిశ్రమలు, ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ఐపిఎస్ సెక్షన్‌లు పోయి వైసిపి సెక్షన్‌లుగా పోలీసులు పనిచేస్తున్నారన్నారు. పోలీసులు ప్రభుత్వానికి వంత పలుకుతూ కక్షసాధింపు చర్యతో కేసులు నమోదు చేస్తున్నా రన్నారు. రాష్ట్రంలో ఇసుక, మైనింగ్, లిక్కర్ అవినీతి రోజురోజుకు ఎక్కువ అయి పోతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్ అధికారం కోల్పోవడం ఖాయ మన్నా రు. ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలు మార్పు చేసేది కాదు ప్రజలే త్వరలో ముఖ్య మంత్రినే మార్చివేసేకాలం దగ్గరపడిందన్నారు. కేంద్రం నుంచి మంజూరు చేసే నిదులతో రాష్ట్రంలో పనులు జరుగుతుంటే కేంద్ర స్టిక్కర్ లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. జగన్ స్టిక్కర్లకు దగ్గరలోనే కాలం చెల్లుతుందన్నారు. కేంద్రంలో మళ్లీ బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్య క్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు సాయిలోకేష్,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్, ఆకుల క్రిష్ణమూర్తి, మాజీ పట్టణ అధ్యక్షులు బర్నేపల్లి రవి, జర్మనీ రాజు, పూల నాగరాజు, ఆనంద్, భగవాన్, మధు పాల్గొన్నారు.

## వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయాలి



**మైదుకూరు రూరల్,డిసెంబర్ 31,ప్రభాతవార్త:**

మైదుకూరు మండలంలోని జీవి సత్రం నుండి నాగసాని పల్లెకు వెళ్లే దారిలో లోకాయ పల్లె గ్రామం వద్ద రైతులు వ్యవసాయ భూముల్లోకి వెళ్లే దారిని పూడ్చిన నేషనల్ హైవే అధికారులు అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడం దారుణమని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఏ.వి.రమణ అన్నారు.రైతు సేవా సమితి నాయకులు పుష్ప రాజ్ తో కలిసి లోకాయ పల్లి గ్రామ రైతుల వినతి మేరకు సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించిన రైతు నాయకులు గ్రామం నుండి వ్యవసాయ భూముల్లోకి వెళ్లే దారిని పూడ్చిన అధికారులు పొలాల్లోకి వెళ్లేందుకు మరో మార్గమైన అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయమని అధికారులను మైదుకూరు మండల రెవెన్యూ అధికారులను కలిసిన స్పందించకపోవడం సమస్య పరిష్కారానికి ప్రయత్నించకపోవడం పద్ధతి కాదని ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు రైతులు పొలాల్లో వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయకపోతే రైతు సేవా సమితి ఆధ్వర్యంలో లోకాయ పల్లె గ్రామ ప్రజలు,రైతులుతో కలిసి సమస్య పరిష్కారమయ్యే వరకు రోడ్డు పనిని అడ్డుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో యువ రైతులు కృపాకర్, శ్రీనివాసులు,సుబ్బరాయుడు,ప్రసాద్ పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



**రాజంపేట డిసెంబర్ 31,ప్రభాతవార్త**

శ్రీ గోదాదేవి శ్రీ మహలక్ష్మి దేవి సమేత శ్రీ ప్రసన్న రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పోస్టర్లను ఆదివారం రాజంపేటలో శ్రీ తిరుప్పావై భక్త సేవా సమితి సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ ప్రసన్న రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని జనవరి 7వ తేదీన ఆదివారం తోట కళ్యాణ మండపంలో అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుం దన్నారు. శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రియమైన మాసము ధనుర్మాసమని, ఈ మాసంలో స్వామివారు ఆనందచిం తుడై ఉంటాడని, శ్రీ మహావిష్ణువును కొలవ డం ద్వారా కోరిన కోరికలు తీరుతా యని ఇతిహాసం ద్వారా తెలుస్తుందన్నారు. ఈ కళ్యాణ మహోత్సవానికి భక్తాదు లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.కళ్యాణ మహోత్సవానికి ఉచిత పాసులకు ఫోన్ నెం: 8897897875,7032994384 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్య క్రమంలో శ్రీ తిరుప్పావై భక్త సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## మహిళల చైతన్యం కోసమే నారీశక్తి సమ్మేళనం




**గాలివీడు, డిసెంబర్ 31(ప్రభాతవార్త):**

సమాజంలో నేడు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడానికి నారీశక్తి సమ్మేళనాలు అని బీజేపీ మీడియా జిల్లా అధికార ప్రతినిధి యర్నాగు భాస్కర్‌రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు గొట్లమిట్ట శ్రీనివాసులురెడ్డిలు సంస్థ మహిళా ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి తిరుచానూరులో జరిగిన నారీశక్తి సమ్మేళనంకు గాలివీడు నుండి సుమారు 45 మంది మహిళలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుచా నూరులో ఆదివారం జరిగిన నారీశక్తి సమ్మేళనం కార్యక్రమంలో గాలివీడు నుండి పాల్గొన్న మహిళలు అందరికీ ఆదర్శంగా నిలుస్తారన్నారు. వేల సంవత్సరాల నాటి నుండి భారతదేశ, భారతీయ స్త్రీ ఖ్యాతి దేదీప్యమానంగా వెలుగొందిందని, వేద, ప్రాచీన, మధ్యకాలం నుండి కూడా భారతీయ స్త్రీ అన్ని రంగాల్లో సమ ర్థులై, కుటుంబ, సమాజ సమాజ నిర్మాణంలో విశేష సహకారం అందించిందని మహిళా త్రిమూర్తులందరికీ మరొకసారి వందనాలు తెలియ జేస్తున్నామని అన్నా రు. కార్యక్రమంలో మధుమతి, కవిత, యాదగిరి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## ఆక్సిజన్ సిలిండర్ వితరణ

**మైదుకూరు డిసెంబరు 31,ప్రభాత వార్త**



మునిసిపాలిటీ పరిదిలోనీ సాయినాథపురంకు చెందన శివనాగు అనే వ్యక్తికి ఆరోగ్యం భాగలేదనే విషయం బిజెపి నియోజక వర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు దృష్టికి తీసుకు రావడం తో వెంటనే ఇయన స్పందించి అతనికి కావలసిన ఆక్సిజన్ సిలిండరు వితరణ చెయడం జరిగింది సమయానికి సిలిం డరు అందించిన సుబ్బరాయుడుకు శివ నాగు కుటుంబ సభ్యులు ధన్యవాదములు తెలియజేశారు.

## గడప గడపకు అయోధ్య రాముల అక్షింతల వితరణ..



**మైదుకూరు డిసెంబర్ 31, ప్రభాత వార్త**

మైదుకూరు పట్టణంలోని అమ్మవారిశాల దేవస్థానం తరుపున విభాగ్ ప్రచారక్ శ్రీలక్ష్మణ్ జీ,రాష్ట్ర సేవికాసమితి జిల్లా కార్యవాహిక శ్రీమాధవీలత చేతుల మీదుగా అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టువారు పంపిన శ్రీరాములవారి అక్షిం తలు అమ్మవారిశాల కమిటీ బృందానికి అందచేయడం జరిగింది.పట్టణంలోని 20దేవస్థానములకు గాను 19 దేవస్థానములకు వితరణ చేయడం జరిగిం దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ ఉపాధ్యక్షులు ఎలవలి హరికిషన్, డి.వి.సునీల్ కుమార్,ఎలిశెట్టి ప్రసాద్,ఆర్ఎస్ఎస్ ప్రతి నిధులు పందిటి పెద్దయ్య,పాశం అనీల్, కమతం లక్ష్మీనరసయ్య, మూడే రామ్ నాయక్, మలి పెద్దు హరినాథ్ జీ, ఖండ విస్తారక్ శ్రీరఘునాథరెడ్డి,కె.డి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి : డిఎస్‌పి

**పీలేరు, డిసెంబరు 31 ప్రభాతవార్తః**

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని శాంతి భద్రతలకు భంగం కలుగ కుండా ఎవరి ఇంటిలో వారు వేడుకలు చేసుకోవాలని డీఎస్పీ మహబూబ్ బాషా తెలిపారు. 31 వతేదీ రాత్రి పదిగంటలు తరువాత ప్రజలు గుంపులు గుంపులుగా తిరగడం కానీ ఒక ప్రదేశంలో ఉండడం కాని చేయకూడదు. రాత్రి వాహనాలు తనిఖీలు ఉంటుందని మద్యం సేవించడం కానీ, ముగ్గురు వ్యక్తులు ప్రయాణిం చడం కానీ, హైవే పై బైక్ రేస్ చేయడం చేస్తే వారిపై కేసులు నమోదు చేయ డం జరుగును, నూతన సంవత్సరం సందర్భంగా ఎటువంటి కేకు కటింగ్ చేయరాదు. కేకు కటింగ్ చేయాలనుకునేవారు వారి ఇళ్లలో మాత్రమేకేకు కట్ చేయాలని, వీధులలో, రోడ్లపై చేయరాదు. రాత్రి 10 గంటల పైన బార్లు, హోట ల్స్, రెస్టారెంటులు, టీ దుకాణాలు మూసివేయాలి, ఎటువంటి ఎంటర్‌టైన్ మెంటు కార్యక్రమాలకు అనుమతులు లేవు, బ్లూకోట్, రక్షక్ టీంలచే రాత్రిల్లు గస్తీ నిర్వహించబడును. సోషల్ మీడియాలో ఎటువంటి అసభ్యకర పోస్టింగ్లు పెట్టరాదు. పట్టణంలో వివిధ కాలనీలోని వీధి దీపాలు, ధ్వంసం చేయడం కానీ, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం కానీ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

## బంగారు భవిశ్యత్తు కోసం టిడిపిని గెలిపించండి-భూపేష్



**ముద్దనూరు, డిసెంబర్ 31, ప్రభాతవార్త:**

బంగారు భవిశ్యత్తు కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని జమ్మల మడుగు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ముద్దనూరు మండలంలోని కె.తిమ్మాపురం గ్రామంలో నిర్వ హించిన బాబుష్యూరిటి భవిశ్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆంజనేయ స్వామి, శ్రీ సీతారామస్వాముల గుడిలో, దస్తగిరి స్వామి దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయకులు, కార్య కర్తలతో, అభిమానులతో ఇంటింటికి తిరుగుతూ అబద్ధపు హామీలతో అధికా రంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి కరెంటు చార్జీలు, బస్సుచార్జీలు, ఇంటి పన్ను లు పెంచి పేద, మధ్య తరగతి వారికి ఇబ్బందులు గురిచేస్తున్న వైసిపి ప్రభు త్వాన్ని గద్దె దింపాలని కోరారు. చంద్రబాబు ప్రకటించిన మిని మేనిఫెస్టో వలన రానున్న ఎన్నికల్లో మహిళలు సైకిల్ గుర్తుకు చంద్రబాబు నాయుడు గారిని ముఖ్య మంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాధ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండల అధ్యక్షులు చింతా శివరామిరెడ్డి, వేల్పుచర్ల బాబు, కె.తిమ్మాపురం గ్రామ నాయకులు రెడ్డి, గోపాలరెడ్డి, వీరారెడ్డి, హృషికేశవ రెడ్డి, కృష్ణారెడ్డి, సాంబశివారెడ్డి, కుళాయిరెడ్డి, అశోక్, రమణారెడ్డి, భూషణం, విక్రమ్, నాగేష్, నాగమునిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నడిపి వీరారెడ్డి, సుబ్బిరెడ్డి, మునిరెడ్డి, మల్లికార్జున్ రెడ్డి ముద్దనూరు మండలం తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



**దువ్వూరు, డిసెంబరు 31, ప్రభాతవార్త**

మైదుకూరు నియోజకవర్గం దువ్వూరు మండలం సంజీవరెడ్డిపల్లి, దువ్వూరు గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఉజ్వల పథకం కింద లబ్ధిదారులైన ఒకరికి ఉచిత గ్యాస్ స్టౌ పంపిణీ చేయడం జరిగింది. గ్రామ ప్రజలు పథకాలు గురించి ఉన్నది ఉన్నట్లుగా చెప్పినందుకు అభినందించారు. ప్రధాని మోదీ ఇన్ని పథకాలు ఇస్తున్నారన్న నిజం మాకు మీ మాటల్లో తెలిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి మాచనూరు సుబ్బరాయుడు, మైదుకూరు మండల అధ్యక్షుడు రామ కృష్ణ, ఖాజీపేట మండల అధ్యక్షుడు అజయ్, బీజేపీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, ఎంపీడీవో, ఏపీవోడీ, పంచాయతీ సెక్రటరీ, వెలుగు సీసీ, ఏపీవో, పవన్, సురేష్ పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న ఎమ్మెల్యే రాచమల్లు

**సమ్మె కాలంలోని పని దినాల జీతం చెల్లింపు**



**ప్రొద్దుటూరు డిసెంబర్ 31, ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల విషయంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మరోసారి తన దాతృ త్వాన్ని చాటుకున్నారు. కొన్ని రోజులుగా మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు జీతాలు పెంచాలని తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె బాట పెట్టిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ప్రొద్దు టూరు మున్సిపల్ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సమ్మె చేపట్టారు. ఈ సమ్మె వల్ల ప్రొద్దుటూరు పట్టణం అపరిశుభ్రతకు గురికావడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి నేరుగా కార్మికుల ధర్నా శిబిరానికి చేరుకొని వారి డిమాండ్లు నెరవేరాలన్నదే తాను కోరుకుంటున్నానని తెలిపారు. మీ సమ్మె వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని తన మాట మన్నించి విధులలో హాజరుకావాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే రాచమల్లు మాట మేరకు 43మంది విధులలో చేరినందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కానీ ప్రభుత్వం కార్మి కుల సమస్యలు పరిష్కరించేందుకు కొంత సమయం కావాలంటున్న నేపథ్యంలో ప్రభుత్వం జీతం పెంచేంతవరకు తానే 3వేల రూపాయలు పెంచి ఇస్తానని ప్రకటించారు. తన మాటను గౌరవించి పనులలో చేరిన కార్మికులకు ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో సమ్మె కాలం లోని నాలు గు పనిదినాలకు 3వేలు జీతం చెల్లించారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు నాలుగు నెలల జీతం తన సొంత నిధుల ద్వారా అందించి తన దాతృ త్వాన్ని చాటుకున్నారు. ఈ సంధర్భంగా కార్మికులు సమస్యలను ఆకలింపు చేసుకున్న ఎమ్మెల్యే రాచ మల్లు ప్రసాద్‌రెడ్డి తమకు ఆర్థిక సహాయం అందించి తన దాతృత్వాన్ని చాటు కున్నారని కొనిఆడారు. అందుకు ఆయనకు ఆయన కుటుం బానికి ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసిం హారెడ్డి, కమీషనర్ పివి రమణయ్య, కౌన్సిలర్లు వరికూటి ఓబుల్‌రెడ్డి, జిల్లానీ బాష, కమాల్‌బాష, గుర్రం లావణ్య, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## పేస్ అకాడమీ ద్వారా ఇంటర్ విద్యతో పాటు నాణ్యమైన ఐఐటి, నీట్ శిక్షణ




**ప్రొద్దుటూరు డిసెంబర్ 31, ప్రభాతవార్త**

ప్రొద్దుటూరులోని ఈ ప్రాంత విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్ విద్యతో పాటు పేస్ అకాడమి ద్వారా ఐఐటి, నీట్ మెడిసిన్‌లకు నాణ్యమైన శిక్షణ అంది స్తున్నట్లు పేస్ అకాడమి స్థాపకులు డాక్టర్ జీలానిబాష, డాక్టర్ శంకర్‌రెడ్డి, షాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎర్రగుంట్ల బైపాస్‌లోని పేస్ అకాడమి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రాంత విద్యార్థుల కోసం ఇంటర్ విద్యతో పాటు పేస్ అకాడమి ద్వారా నాణ్య మైన శిక్షణ అందించేందుకు వ్యాపార ధృక్పధంతో కాకుండా సేవా దృక్పధంతో అన్ని వర్గాల విద్యార్థులకు అనుగుణంగా ప్రొద్దుటూరులోనే స్పేస్ నీట్ ఐఐటి అకాడమి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రొద్దుటూరులో పాఠశాల స్థాయి వరకు నాణ్యమైన విద్య అందుతుందని, ఇటర్మీడియట్ స్థాయిలో నీట్ ఐఐటి ప్రిపరేషన్ టెస్టులలో పాల్గొనేందుకు నాణ్యమైన శిక్షణ సంస్థలు లేకపోవ డంతో ప్రొద్దు టూరు ప్రాంత విద్యార్థులు దూరపు ప్రాంత నగరాలకు వెళ్లి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని తెలిపారు. అలాంటి ఇబ్బందులు లేకుండా మన ప్రాంత విద్యా ర్థుల కోసం జాతీయస్థాయిలో పేరు పొందిన పేస్ అకాడమి ద్వారా ప్రొద్దు టూరులోనే నాణ్యమైన ఇంటర్మీడియట్ విద్యతో పాటు మంచి అధ్యాపకు లతో ప్రిపరేషన్ టెస్టులకు శిక్షణ అందిస్తున్నామన్నారు. ఇతర ప్రాంతాలలో చెల్లిస్తున్న ఫీజుల కంటే 40శాతం తక్కువతోనే నాణ్యమైన శిక్షణ అందిస్తున్నామని తెలి పారు. ప్రొద్దుటూరు ప్రాంతం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసు కొని స్థానికంగానే విద్యను అభ్యసించి మంచి ర్యాంకులు పొందే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో బిజినెస్ మేనేజర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నమయ్య ప్రాజెక్టు, వరద నష్టంపై బిజెపి కోర్టులో ప్రత్యేక అఫిడవిట్

**రాష్ట్ర కార్యదర్శి ఎన్.రమేష్‌నాయుడు**



**రాజంపేట అర్బన్, డిసెంబరు 31 ప్రభాతవార్త**

అన్నమయ్య ప్రాజెక్టు వరదల్లో బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని నామ మాత్రంగానే ప్రభుత్వం సహాయం అందించి చేతులు దులుప కుందని బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు చేసిన ప్రజావాజ్యంపై తాజాగా ప్రత్యేక అఫడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు బిజెపి రాష్ట్ర కార్యదర్శి రమేష్‌నాయుడు ప్రాజెక్టు ఎర్త్‌డా మ్ కొట్టుకుపోయి జరిగిన నష్టం, ప్రభుత్వం ఏ మేరకు సహాయం చేసిందని తెలుసుకునేందుకు మందపల్లె, పులపత్తూరు గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఇసుకమేటలతో రైతులకు జరిగిన నష్టం ఏ మాత్రం పూడ్చలేదని తెలిసిందన్నారు. పశువులు వేలాదిగా నష్టపోయినా నామమాత్రంగానే పరిహారం అందిందన్నారు. పంటనష్టం జరిగినా పరిహారం అందలేదన్నారు. ఆలయాలు కొట్టుకుపోయినా దిక్కులేదన్నారు. రెండేళ్ల పూర్తయిన వరద బాధిత గ్రామాల్లో ఒక్క ఇళ్లు పూర్తి కాలేదని, పులపత్తూరులో మాత్రమే కొంతమేరకు పనులు జరిగాయని, మిగతా గ్రామాల్లో పనులే ప్రారంభించలేదని పేర్కొన్నారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంటనష్టంపై జగన్ సర్కార్ సక్రమంగా స్పందించలేదని హైకోర్టులో అఫడవిట్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు.

## పెంచిన కొత్త పెన్షన్ 3వతేది ప్రారంభం

**మునిసిపల్ కమిషనర్ రంగస్వామి**

**మైదుకూరు డిసెంబరు 31, ప్రభాత వార్త**



పెంచిన 3వేల రూపాయల కొత్త పెన్షన్ 3వ తేదిన మైదుకూరు జడ్పి హైస్కూల్ మైదానంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి చేతుల మీద పంపిణీ చెయ నున్నట్లు మునిసిపల్ కమిషనర్ రంగ స్వామీ తెలియ జేశారు. అనంతరము ఆయన అందరికి 2024వ సంవత్సరము శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంత రము ఆయన మాట్లాడుతూ పురపాలక పరిధిలో క్రొత్తగా మంజూరైన పింఛను లను రూ/2750 నుండి 3వేలకు పెంచిన సంధ ర్భం గా ఈ కార్యక్రమం జరుగునని తెలియజేశారు. కావున పురపాలక పరిధిలోని పెన్షన్ దారులు అందరు హాజరు కావలసినదిగా కొరారు.

## గ్రామాల అభివృద్ధే బిజెపి లక్ష్యం

**బిజెపి నియోజకవర్గ కోకన్వీనర్**




**నందలూరు, డిసెంబరు 31 ప్రభాతవార్త**

రాజంపేట నియోజకవర్గంలోని నందలూరు మండలంలో ఆదివారం ఆడపూరు గ్రామం, నందలూరు గ్రామ పంచాయతి 'వికసిత భారత సంకల్ప యాత్ర' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి నియోజకవర్గ కోకన్వీనర్ డాక్టర్ అరిగె రాంబాబు, వికసిత భారతసంకల్పయాత్ర కోఆర్డినేటర్ ఆదినారా యణ, నియోజకవర్గ నాయకులు నాగోతు రమేష్‌నాయుడులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన గురించి దేశవ్యాప్తంగా మూలమూలన ఉన్న పల్లెల్లో సైతం గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీనవర్గాల కోసం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాల తీరుతెన్నులు గురించి ఆయా వర్గాల ప్రజల్లో అవగాహన కల్పించి పథకాలు అందని అర్హులకు పథకాలు అందేలా చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఏమేమి పథకాలు అందిస్తున్నది తెలియజేయడానికి 7 పంచాయతిల్లో స్థానిక సచివాలయం ఆవరణంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నంద లూరు సర పంచ్ సుభాషిని, ఉపసర్పంచ్ ఇబ్బు, ఇరిగేషన్ ఎఇ, ఆరోగ్యశాఖ నుండి మెడికల్ ఆఫీసర్, ఆరోగ్య సిబ్బంది, రెవెన్యూశాఖ నుండి స్థానిక విఆర్ఒ, సహకార బ్యాంకు సిబ్బంది, హౌసింగ్‌శాఖ సిబ్బంది, ఎంపిడిఒకు బదులుగా ఇన్‌ఛార్జి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

## డ్యాషింగ్ కార్లు ప్రారంభం

**కడప కార్పొరేషన్, డిసెంబరు 31, ప్రభాతవార్త**



పిల్లల ఆట పాటలకు చక్కటి వేదికపై శిల్పారామంలో ఆదివారం నూత నంగా డ్యాషింగ్ కార్లను శిల్పారామం రాష్ట్ర పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 1న సాంస్కృతిక కార్యక్రమాలు మరిన్ని ఉంటాయని నగరవాసులు ఉపయోగించుకోవాలని కోరారు.










